బంద్ - 1999

ఆ రోజు అదివారం. అయితే మా కాలనీ వాళ్ళంతా కాలనీ వేదిక దగ్గర గుమికూడింది అందుక్కాదు. మర్నాడు రాష్ట్రప్రభుత్వం స్వయంగా జరిపిస్తున్న బంద్ గురించి మాట్లాడడానికి. మా కాలనీలో రాష్ట్ర ప్రభుత్వోద్యోగులతోపాటు కొంతమంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా వుండడం వల్ల మేమంతా బంద్‌లో పాల్గొనాలా వద్దా అనే విషయం చర్చిస్తున్నాం.

కాసేపటి తర్వాత మోటార్ సైకిల్స్ మీద ఉద్యోగ సంఘ నాయకులు హడావుడిగా వచ్చారు. వస్తూనే స్పీచ్ అందుకున్నాడో నాయకుడు.

“సోదర సోదరీమణులారా! మన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ బంద్‌తో సహకరిస్తామని ప్రభుత్వానికి మాట ఇచ్చాము. అందుకు ప్రతిఫలంగా ప్రభుత్వం మనకి– అంటే– ఒక్కొక్క ఉద్యోగికీ అయిదు వందల రూపాయల నగదు, ఒక జతటెర్లిన్ బట్టలు, ఒక పాలిస్టర్ చీర జాకెట్టు, ఒక కుంకుమ భరిణ, పిల్లలకు ఆటవస్తువులూ ఇస్తుంది. కనుక మీరంతా వెంటనే మీ మీ ఆఫీసులకెళ్ళి అవన్నీ, తెచ్చుకోవలసిందిగా కోరుతున్నాం!”

అంతా తప్పట్లు మార్మోగిపోయినయ్.

అడాళ్ళంతా కుంకుమ భరిణ, పాలిష్టర్ చీర సంగతి వింటూనే విప్పారిన మొఖాలతో బంద్‌వల్ల ఎన్నిలాభాలున్నయో చర్చించుకోసాగారు.

ఈలోగా కేంద్రప్రభుత్వోద్యోగుల నాయకుడు స్పీచ్ మొదలుపెట్టాడు.

"సోదరీ సోదరీమణులారా! ఈ బంద్ మన దేశప్రయోజనాలకు భంగకరం అని మన కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. కనుక మనందరం ఈ రాత్రికే ఆఫీసుల కెళ్ళి అక్కడే పడుకుని రేపు పూర్తి అటెండెన్స్‌తో పనిచేయడానికి మన కార్మిక సఘం అంగీకరించింది. ఇందుకు ప్రతిఫలంగా మనకు ఒక్కొక్కరికీ ఆరువందల రూపాయల నగదు, ప్రతి కుటుంబానికి రైల్లో ఆలిండియా టూర్‌చేసే ఫ్రీపాసూ, రెండుచీరలు, పిల్లలకు ఉచితంగా యూనిఫారం, పుస్తాకాలూ ఇస్తారు. ఇవికాక ఇవాళరాత్రి ఆఫీసుల్లో గడిపేవారికి టైమ్‌పాస్‌కోసం ప్రముఖ సినీ సెక్స్ డాన్సర్‌లు ఒకో ఆఫీస్‌కూ ఒక్కొక్కరు చొప్పున వెళ్ళి డాన్స్‌లుచేస్తారు. ఇంతేకాకుండా ప్రతి నలుగురికీ రెండు సెట్ల పేకముక్కలు, దానితోపాటు వందరూపాయలు కిట్టి మనీ గూడా ఏర్పాటు చేస్తారు. ఇవికాక రాత్రి నాలుగు రకాల బ్రాందీ విస్కీలు, ఎనిమిదిరకాల నాన్ వెజిటెరియన్ వంటకాలతో భోజనాలు, ఉదయం బెడ్‌కాఫీ, కాఫీ ఫలహారాలు, మళ్ళీ మధ్యాహ్నం బఫె డిన్నర్‌లూ ఉంటాయి. రాత్రి మంచాలూ యూఫోంబెడ్స్ కూడా ఏర్పాటు చేసేయడం జరుగుతుంది. రాత్రికి కొంతమంది వేశ్యలను ఏర్పాటు చేసే విషయం గురించి కూడా మన యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది. కానీ ఇంకా వివరాలు తెలీదు."

దాంతో కేంద్రప్రభుత్యోద్యోగులందరూ తప్పట్లు కొట్టి విజిల్స్‌వేశారు ఆనందంగా. అయితేవాళ్ళ ఆడాళ్ళుమాత్రం కస్సుమంటూ లేచారు.

"ఏమిటి? మా మగాళ్ళకు వేశ్యలను ఏర్పాటుచేస్తారా?" అంటూ చెంగు దోపుతుంటే నాయకుడు ఖంగారు పడ్డాడు. "అబ్బే ఊరికే- జోక్‌కి అన్నాను" అంటూ మాకేసి తిరిగి కన్నుకొట్టాడు.

మా అందరికీ కేంద్ర ప్రభుత్యోద్యోగులను చూస్తే ఈర్షకలిగింది. వాళ్ళు హాయిగా ఆఫీసులో ఎంజాయ్ చేస్తుంటే మేము ఇంటిదగ్గర పడిచావాలి.

అప్పటికప్పుడే అందరం ఆఫీసులకెళ్ళి డబ్బూ, చీరలూ, ఇతర వస్తువులూ అన్నీ డ్రాచేసుకుని ఇళ్ళకు చేరుకున్నాం.

మర్నాడు మేము కూడా నాలుగయిదు కుటుంబాలకు ఒక వి.సి.ఆర్. కొన్ని సినిమా కేసేట్లు తెచ్చుకుని హాయిగా గడపాలని నిర్ణయించుకున్నాం.

మరికాసేపట్లో నాలుగు బస్‌లు వచ్చి కేంద్రప్రభుత్వోద్యోగులకు డబ్బూ యితర వస్తువులూ యిచ్చి ఆఫీసులకు తీసుకెళ్ళిపోయినాయ్.

ఆ రాత్రి వెన్నెల్లో కూర్చుని మర్నాడు మగాళ్ళకోసం కాలనీలో ఏమేం ఏర్పాట్లు జరపాల్సిందీ చర్చలు ప్రారంభించాము.

పేకాడే వాళ్ళంతా లక్ష్మణరావ్ వాళ్లింట్లో సమావేశమయేట్లూ, ప్రత్యేక వంటకాలంటే పడిచచ్చేవారంతా బగారాబైగన్ వెంకట్రావ్ ఇంట్లో కలుసుకునేట్టూ ఇలా రకరకాల ఏర్పాట్లు చేసేస్తున్నారు. సరిగ్గా అప్పుడే ఓ జీప్, దాని వెనకో వ్యాన్ వచ్చి ఆగాయ్ మాకు కొద్దిదూరంలో.

అందులోనుంచి హోమ్ మినిష్టర్, ఓ పోలీస్ అధికారీ దిగారు.

"సోదరులారా! రేపు మనందరం కలసి కేంద్రానికి వ్యతిరేకంగా బంద్ చేస్తున్నామన్న విషయం మీకు తెలిసేవుంటుంది! బంద్‌వల్ల ఎన్నిలాభాలున్నామో మీకందరకూ తెలిసేవుంటుంది. కేంద్రప్రభుత్వానికి ఒక్కరోజులో ఆరువందల అరవైకోట్లునష్టం వచ్చేలా చూడడం మనందరి ధ్యేయం అని నేను మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. ఈ టార్గెట్ని సాధించడం కోసం మనందరం ప్రాణాలకు తెగించి కేంద్రప్రభుత్వానికి చెందినటువంటి రైళ్ళు, టెలిఫోన్‌లు, దూరదర్శన్, ఆకాశవాణిలాంటి అనేక సంస్థలకు భారీనష్టం కలుగజేయాల్సివుంటుంది. అవసరమయితే కొన్ని రైళ్ళను ప్రయాణీకులతో సహా తగలబెట్టాలి. ఎందుకంటే బంద్‌నాడు ప్రయాణం చేసేవారంతా కేంద్రంలోని అధికారపార్టీవాళ్ళుగాని, వాళ్ళ సానుభూతి పరులుగానీ అయుంటారని నేను నొక్కి వక్కాణిస్తున్నాను. ఏది! అందరూ ఓ సారి గట్టిగా అరవండి! రేపు మేమందరం ఎవరి ప్రోద్బలం లేకుండా మా అంతట మేమే స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్నాం" అంటూ అరిచాడతను.

మేమెవ్వరం అరవకపోయేసరికి అతనికి మా మీద కోపం వచ్చేసింది.

"మీకేచెప్పేది- అరవండి" అన్నాడు మండిపడుతూ.

అయినా మేమెవ్వరం నోరు మెదపక పోయేసరికి పోలీసు అధికారి వేపు తిరిగాడతను.

మరుక్షణంలో వ్యాన్‌నుంచి పాతికమంది కానిస్టేబుల్స్ తుపాకులు తీసుకుని మమ్మల్నందరినీ చుట్టుముట్టారు. రంగారెడ్డిని బట్‌తో ఒక్కపోటు పొడిచాడో పోలీసుఅధికారి.

"చూస్తారేమిట్రా అరవండి! బంద్ గురించి గవర్నమెంట్ దగ్గర అయిదొందలు తీస్కుని ఇంకేం రోగం అరవకపోటానికి?"

అప్పటికీ అరవకపోతే ఏం జరుగుతుందో మాకు తెలుసు.

అందుకని వెంటనే అరచాము.

"రేపు మేము ఆనందంగా, సంతోషంగా బంద్‌లో పాల్గొంటున్నాము.

ముఖ్యమంత్రీ- దేవుడూ!

ప్రధానమంత్రీ- రాక్షసుడూ!

బంద్- జయప్రదం కావాలి!

కేంద్రం– పడిపోవాలి! నాశనమయిపోవాలీ!

రాష్ట్రం గెలవాలి! వర్థిల్లాలీ!”

మేము నినాదాలు చేస్తున్నంతసేపూ జీప్‌లోనుంచి ఒకడు మామీద ఫ్లడ్‌లైట్స్‌వేసి వీడియో కెమెరాతో షూటింగ్ చేశాడు.

హోమ్‌మంత్రి కెమెరామెన్ వైపు పరుగెత్తాడు.

“ఒరే వీడియోవాలా! జాగ్రత్తగా తీయి! పోలీసులు వాళ్ళ వీపులకు తుపాకి గురిపెట్టటం ఫిల్మ్‌లో ఎక్కడా కనబడకూడదు! అర్థమయిందా!”

“అయిందిసార్” అంటూ హోమ్‌మంత్రి కాళ్ళు కళ్ళకద్దుకున్నాడతను. అప్పుడు చూశాం అతనిని మేము. అతను పబ్లిక్‌రిలేషన్స్ డిపార్ట్‌మెంట్‌కి చెందిన ఐ.ఏ.ఎస్. అధికారి.

“ఇదిగో ముందేచెపుతున్నా వినండి! రేపు ఒక్క పిట్టకూడా ఇళ్ళల్లోనుంచి బయటకు రాకూడదు. ఎవరికైనా జబ్బుచేస్తే పోలీసుల సహాయం తీసుకోండి! వాళ్ళు జబ్బుచేసిన వ్యక్తి రెండు రోజులు స్పృహతప్పేట్లు కొన్ని మందులిస్తారు. స్పృహవచ్చాక అప్పుడు డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళవచ్చు. రేపెవరయినా చనిపోతే శవాల్ని మీ పెరట్లోనే తవ్వి పాతేసుకోండి గానీ శ్మశానాలకు వెళ్ళడానికి కూడా అనుమతి ఇవ్వబడదు. అర్థమయిందా?” గట్టిగా అడిగాడు మినిష్టరు.

అందరం అయిందని తలూపాము.

వెంటనే జీప్, దాని వెనుకే పోలీసులతో వానూ వెళ్ళిపోయాయి.

“దిసీజ్ టూ మచ్” అన్నాడు రంగారెడ్డి కాసేపు నిశ్శబ్దంగా వున్నాక.

“అవును! ప్రజల్ని వీళ్ళు కుక్కలకంటే హీనంగా చూస్తున్నారు” అన్నాడు శాయిరామ్.

అందరూ ఎవరి అభిప్రాయాలు వాళ్ళు చెపుతుండగానే ఇంకో పెద్దవాన్ చాలా బలమయినా సారావాసనతో రివ్వునవచ్చి మాముందాగింది. అందులోనుంచి పాతికమంది లావుపాటి వ్యక్తులు తూలుతూ మా దగ్గరకొచ్చారు. అందరి చేతుల్లోనూ కర్రలున్నాయ్. ఒకరిద్దరు మాత్రం తుపాకులు పట్టుకుని నిలబడ్డారు.

“ఏయ్! ఈ కాలనీ కమిటి ప్రెసిడెంట్, సెక్రెటరీ ఎవరు?” అడిగాడు ఒకడు. వాడు కిందపడిపోకుండా ఇంకో ఇద్దరు గట్టిగా పట్టుకుని నిలబెట్టారు.

మాకు వళ్ళు మండిపోయింది.

“ఏయ్ అంటావేంది? మంచిగా మాట్లాడడం రాదుబే నీకు?” అన్నాడు యాదగిరి కోపంగా.

“ఏంది? మంచిగా మాట్లాడాలా? నీయవ్వ” అంటూ యాదగిరిమీద నలుగురుపడి చేతులు విరిచి కిందపడేశారు.

పరిస్థితి విషమించేట్లుందని రంగారెడ్డి, గోపాల్రావ్ ముందుకి వచ్చారు.

"నేనే కాలనీ శెక్రటరీని! ఈయన ప్రెసిండెట్! మాతో ఏమిటి మీకు పని?" అడిగాడు రంగారెడ్డి.

"గట్ల మంచిగా మాట్లాడాలిభాయ్! ఇగోసూడు! కేంద్రంలోని అధికారపార్టీకి ఈ ఏరియాలీడర్ని నేను! నాపేరు నర్సింహ! సమజైందా?" అడిగాడతను

"అయింది! ఇంతకూ మాతో ఏమిటి పని మీకు?" మళ్ళీ అడిగాడు రంగారెడ్డి సౌమ్యంగా.

"ఏం లేదన్నా! రేపు ఈ ఫాల్తూ అపోజిషన్ కొడుకులు మన రాష్ట్రంల బంద్ చేయనికి కోషిష్ జేస్తున్రు! బంద్ గిట్టజేస్తే జెస్కోనీగాని, కిరికిరేడొస్తున్నదంటే ఈ బంద్ జబర్దస్త్ చేస్తున్రన్నా! మనదేశంల గిట్ల జబర్దస్త్ చేసెడిది గలత్ కదా!"

"ఆ మాట నిజమే!" వప్పుకున్నాడు రంగారెడ్డి.

"అవునా అన్నా! జబర్దస్త్ గాకుండా మీదికెళ్ళి మీ అందర్కీ పైసలు గిట్ట ఇచ్చి ఇళ్ళల్లోకెళ్ళి బయటకు రావొద్దని చెప్తున్నది. ఎంత బేఇజ్జత్ సంగతిది?"

"అవ్! చాలా బేఇజ్జత్" అన్నాడు గోపాల్రావ్.

"ఇప్పుడు మేమొచ్చిన పనేమంటే రేపు ఎట్లయిన మనం ఈ బంద్ని ఫెయిల్ జేయాలె! అంటే మీరంతా ఆఫీసులకు వెళ్ళాలె! సమజైందా?"

మేము ఉలిక్కిపడ్డాం! "ఏమిటి? రేపు మేము ఆఫీస్లకెళ్ళాలా?"

"బరాబర్ ఎళ్ళాలె! ఆఫీస్లకు పోనీకి రెండుబస్లు మేమే ఎరేంజ్ చేస్తం! సమజయిందా?"

"అయిందిగానీ– ఆఫీసు కెళ్ళడానికి వీల్లేదని ఇప్పుడే హోమ్మినిష్టర్ వార్నింగ్ ఇచ్చి వెళ్ళాడు కదా!" అన్నాడు గోపాల్రావ్ సణుగుతూ.

"అరె ప్రెసిడెంట్! జీనానై హై క్యారే తేరేకో? రేపు తొమ్మిదిగంటలకు రెండు లారీలు తెస్తున్నా! అందరూ లారీలు ఎక్కకపోయిన్రో బేఇజ్జతవుతది. సమజైందా?" ఇక లాభంలేదని రెడ్డి కల్పించుకున్నాడు.

"ఇదిగో చూడండి నర్సింహగారూ! మీరిలా జబర్దస్త్ చేయడం ఏమీ బాగుండలేదు. ప్రభుత్వమే రేపు ఆఫీసులు మూసేస్తోంది."

"అదంతా మాకు తెల్వదు భాయ్! మా లీడర్సాబ్ చెప్పిండు. ఆఫీసులు ఖుల్ల ఉండినా, లేకున్నాగానీ మీరు ఆఫీస్ల ముందు నిలబడాలె! లేకుంటే మీ భార్యాబిడ్డలను కిడ్నాప్ జేస్తాం! ఏం జెప్తున్న?"

"సరే" అన్నాడు గోపాల్రావ్ నీరసంగా.

మరుక్షణంలో వాన్‌వెళ్ళిపోయింది.

అందరం ఒకరిమొఖాలొకరు చూసుకున్నాం.

"ఇప్పుడేమిటి చేయడం?" అడిగాడు రంగారెడ్డి.

"ఈ గూండాలతో గొడవెందుగ్గాని మనం ఆఫీస్‌లకెళ్ళడమే మంచిది" అన్నాడు శాయిరామ్.

"కాని స్టేట్ గవర్నమెంట్ ఆఫీసులకు రాకుండా వుండడానికి కదా! మనకి అయిదువందలు ఇచ్చింది?"

"అయితే ఓ పనిచేద్దాం! అందరం ఆఫీస్‌లకు వెళ్దాంగానీ కాంటీన్ దగ్గరే కూర్చుని మధ్యాహ్నానానికి తిరిగి వచ్చేద్దాం!" అన్నాడు గోపాల్రావ్.

ఆ అయిడియా అందరికీ నచ్చింది.

"ఒకే బులెట్‌కి రెండు పిట్టలు" అన్నాడు గోపాల్రావ్.

ఉదయం ఆఫీస్ కెళ్ళడానికి అందరం రెడీ అయి గూండాల స్పెషల్ లారీలకోసం ఎదుర్చూచూస్తు వేదిక దగ్గర కూర్చున్నాం. అయితే లారీలకు బదులుగా ఇంకోపెద్ద వాన్‌వచ్చింది. అందులోనుంచి ఓ పాతికమంది గూండాలు– తుపాకులు, బాంబులు తీసుకుని దిగారు. వాళ్ళతోపాటు రాష్ట్ర హెూంమంత్రి దండలతో దిగాడు.

"ఏయ్! ఇయాళ బందని తెల్సికూడా మళ్ళీ ఆఫీస్‌కెళ్ళడానికి ఈడెందుకు జమయిన్రుబే? తలగిట్ట తిరుగుతున్నదా ఏం?" అడిగాడు మినిష్టరు.

గోపాల్రావ్ లేచి వినయంగా నిలబడ్డాడు.

"అది కాదండీ! రాత్రి ఇంకెవరో గూండాలు వచ్చి ఆఫీస్‌లకెళ్ళకపోతే మా ఇళ్ళమీద ఎటాక్ చేస్తామని చెప్పారు. అందుకనీ...."

"అందుకని మా దగ్గర అయిదొందలు తీస్కోని మళ్ళీ ఆపార్టీగూండాలు చెప్పినట్టు చేస్తారు? నీయవ్వ మీకేమయినా షరమున్నదా? తినేది స్టేట్ గవర్నమెంట్ ఉప్పు పలికేది. కేంద్రప్రభుత్వం పలుకులా? ఇగో! ఇప్పుడే చెప్తున్నా ఇనండ్రి! ఒక్కడు గూడా ఆఫీసులకు పోయిండో ఈ కాలనీ ఖబరసాన్ అవుతది! ఏం చెప్తున్న?"

అందరం భయంగా తలూపాం! వాళ్ళు మళ్ళీ వాన్‌లో ఎక్కారు.

'ఇగో–నేను గంటకోసారి ఈడకొచ్చి మీ అందరి హాజరు తీసుకుంటా! సాయంత్రం వరకూ ఇట్లా గంటగంటకూ చెకింగ్ చేస్తనేవుంటా! సమజయిందా?" అడిగాడు హెూమ్‌మినిష్టర్.

అందరం తలూపాము. అందరి మొఖాలు పాలిపోయివున్నాయి.

వాన్ వెళ్ళిపోయింది.

దూరంగా మెయిన్‌రోడ్‌నుంచి లౌడ్‌స్పీకర్ అమర్చిన పోలీస్‌వాన్ బిగ్గరగా హెచ్చరికలు చేసుకుంటూవెళ్తోంది.

“ప్రజలకు పోలీసు హెచ్చరిక! ఇవ్వాళ ప్రభుత్వం బంద్ జరుగుతన్నది. కనుక రాత్రి పన్నెండు గంటల వరకు ఇళ్ళనుంచి బయటకు రావడం నిషేధించడమైనది. ఈ నిషేదాన్ని ఉల్లఘించిన వారిని నిర్ధాక్షిణ్యంగా చంపుటకు మాకు అధికారం ఉందని తెలుసుకో ప్రార్ధన” మా గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. అందరి మొఖాల్లోనూ భయం కనిపిస్తూందిప్పుడు.

ఆ వాన్ దూరం వెళ్ళిపోగానే రెండు లారీల్లో గూండాలు కేంద్రంలోని అధికారపార్టీ జెండాలతో రాష్ట్ర ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూవచ్చేశారు.

“ఛల్ ఎక్కండి” అన్నారు వాళ్ళు లారీలు పట్టుకుని మావేపువస్తూ.

“కానీ ఆఫీస్‌కెళ్తే చంపేస్తామని రాష్ట్రంలో అధికార పార్టీ వాళ్ళన్నారు కదా! ఎవరిమాట వినాలి మేము?” అన్నాడు రంగారెడ్డి ధైర్యంగా.

వాళ్ళంతా రంగారెడ్డి వేపు చూశారు.

“ఎవరి మాట వినాలా? ఎవడిచేతిలో కత్తివుంటే ఆడి మాటవినాలి? తెల్సిందా” అన్నాడొకడు. ఇంకొకడు కత్తితీశాడు బయటకు.

ఇంక గత్యంతరం లేక లారీలు ఎక్కసాగాము.

కాలనీలోని ఆడాళ్ళూ, పిల్లలూ అందరూ భోరున ఏడుస్తూ లారీలచుట్టూ నిలబడ్డారు.

“ఏవండి! మనపెద్దాడిని టెన్త్ అయాక ఏం చదివించమంటారు?” అంది మా ఆవిడ కన్నీరు తుడుచుకుంటూ.

“వాడిని నేనుంటే ఇంజనీరింగ్ చదివిద్దామనుకున్నానే! కానీ నీకు అంత పెద్ద చదువు చదివించడం కష్టమవుతుందో ఏమో! పాలిటెక్నిక్‌లో చేర్పించు” చెప్పాను.

“ఏమండీ! మీరు పోతే గవర్నమెంట్ మాకెంతిస్తుంది?” అడిగింది ఒకామె తన భర్తను.

“రెండులక్షలు ఇస్తారనుకుంటానే! దాంతో ఏ ఆస్ట్రేలియాకో, సింగపూర్‌కో వలస వెళ్ళిపో! పిల్లలయినా బాగుపడతారు” చెప్పాడు అతను.

కాసేపు అప్పగింతలూ, ఏడుపులూ అయ్యాక మా లారీలు బయల్దేరాయి.

రోడ్లన్నీ ఖాళీగా వున్నాయిగానీ చాలాచోట్ల రోడ్డుకి అడ్డంగా ముళ్ళకంచెలు వేసివున్నాయి. వాటిని ఓ క్రేన్ తొలగిస్తుంటే వెనుక మా లారీలు నడవసాగినయి. కోఠీచౌరస్తా దగ్గర కొచ్చేసరికి పోలీసులు తుపాకులు పట్టుకుని అడ్డంగా నిలబడ్డారు.

“వెంటనే లారీలు వెనక్కు తిప్పి ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోండి! లేకపోతే కాల్పులు జరపాల్సివస్తుంది” అంటూ తుపాకులు ఎక్కుపెట్టారు వాళ్ళు. మా లారీలో గూండాలు

వాళ్ళమీద బాంబులు విసిరారు. వాళ్ళు పారిపోతూనే తుపాకీలు కాల్చారు. భయంకరమయిన శబ్దాలకు భయపడిపోయి మేము లారీలో తలవంచుకుని వణుకుతూ కూర్చుండిపోయాము.

అరగంటసేపు యుద్ధం జరిగింది.

పోలీసులు మాములుగానే పారిపోయారు. గూండాలలో అరడజనుమంది బుల్లెట్ దెబ్బలతో చచ్చికిందపడివున్నారు. మా లారీలు మళ్ళా బయల్దేరాయ్. అబిడ్స్ వెళ్ళేసరికి ఇంకా చాలామంది పోలీసులు తుపాకులతో చుట్టుముట్టేశారు. గూండాలు కూడా బాంబులు విసిరారుగానీ అవి పేలలేదు. వాళ్ళందరినీ పోలీస్‌వాన్‌లో ఎక్కించేశారు.

"నీయమ్మ! ఈ బాంబులు తయారుచేసిన కంట్రాక్టరుగాడు మోసం చేశాడు" అన్నాడు గూండా.

"ఎవరు మీరంతా?" అడిగాడు పోలీస్ అధికారి మమ్మల్ని

"మేము ప్రభుత్వోద్యోగలం సార్! ఈ గూండాలూ మమ్మల్ని బలవంతంగా యిళ్ళల్లోనుంచి బయటకీడ్చుకొచ్చి ఆఫీసుకి తీసుకెళుతున్నారు."

"ఆల్‌రైట్! వెంటనే వెనక్కు తిరిగి ఇంటికి వెళ్ళిపోండి. ఇంకొకసారి బయటెక్కడయినా కనిపించారో కాల్చిపారేస్తాం! జాగ్రత్త!" హెచ్చరించాడతను.

మేము ఈసురోమంటూ మళ్ళీ మా కాలనీవేపు బయలుదేరాం. దారిలో రోడ్‌పక్కనే నిలబడివున్న పెద్ద గూండాల గుంపు కనిపించేసరికి మాకు భయంవేసి కొద్దిదూరంలోనే నిలబడిపోయాం.

"ఏయ్ దుకాణాలు ఖుల్లపెట్టాలని చెపితే ఎందుకు బంద్‌జేసిన్రుబే?" కొంతమంది వ్యాపారస్తుల్ని గద్దిస్తూ అడిగాడు గూండా నాయకుడు.

"తెరుస్తే షాపులు తగలబెడతామని ఆపోజిషనోళ్ళు జెప్పిన్రు భాయ్! మేమేం జెయ్యాలి?"

"ఇగో! ఈ నకరాలు మన దగర నడవవు. గిప్పుడు ఖుల్లజేస్తరా లేదా? ఒకటేమాట అడుగుతున్న!"

"చేస్తే వాండ్లొచ్చి దుకాణాలు తగలబెడతారు సార్" అతని కాళ్ళమీద పడ్డారు వాళ్ళు. గూండా నాయకుడికి కోపం ఆగలేదు.

"అరేయ్! క్యాదేఖ్‌రైరే! జలావ్ దుకాణోంకో" అరిచాడు.

మరుక్షణం షాపులన్నింటిలోపల పెట్రోల్ పోసి నిప్పంటించారు వాళ్ళు. పెద్ద ఎత్తున మంటలు లేచేసరికి మేము పరుగు మొదలు పెట్టాము. రెండుగంటలు ఆగకుండా పరుగెడితే గానీ మా కాలనీ చేరుకోలేకపోయాము. అప్పటికే అంత దూరం నడవడం అలవాటు లేకపోవడం వల్ల పాదాలు పుళ్ళయిపోయాయి. దానికితోడు భయంకరమయిన నొప్పులు.

ఇళ్ళలోకెళ్ళి రెండురోజులు కదలకుండా మంచాలమీద పడివుంటేగానీ తిరిగి తేరుకోలేమని మాకు అర్థమయింది.

తీరా కాలనీ చేరుకునేసరికి ఇంకో రెండు లారీలు వాటి పక్కనే తుపాకులతో నిలబడ్డ మరో గుంపు కనిపించారు.

కాలనీలో మా ఇళ్ళన్నీ ధ్వంసం అయివున్నాయి. సామానంతా ఇంటి బయట తగలబడుతూ కనిపించింది. ఆడాళ్ళూ, పిల్లలూ అంతా బయటే నిలబడి ఏడుస్తున్నారు.

"ఏమిటి? ఏం జరిగింది?" అడిగాము ఆడాళ్ళను.

"అందరూ ఇళ్ళల్లోనే వుండాలని హోమ్‌మినిష్టరు చెప్పినా మీరు వినకుండా ఆఫీసుల కెళ్ళారని తెలిసి, పోలీసులను తీసుకొచ్చి అంతా ధ్వంసం చేయించాడు దగ్గరుండి."

మాకేం చేయాలో తెలీలేదు.

"ఏయ్ లారీలెక్కండి" అంతవరకు మా వంక నిశ్శబ్దంగా చూస్తున్న గుంపులో నుంచి ఒకడు మాకు తుపాకీ గురిపెట్టి అరచాడు.

"మళ్ళీ మీరెవరు?" ఏడుపు ఆపుకుంటూ అడిగాడు రంగారెడ్డి.

"నీ యవ్వ! ఆఫీసుల కెళ్ళమని లారీలెక్కిస్తే మళ్ళా వెనక్కు తిరిగొస్తారా? సాలే! ఎక్కండి లారీ! లేకపోతే అందర్నీ పిట్టల్ని కాల్చినట్లు కాల్చిపారేస్తాం" అంటూ గాల్లోకి తుపాకీ పేల్చాడు. యాదగిరికి పౌరుషం పొడుచుకొచ్చింది మళ్ళీ.

"నీయవ్వ! బయటికెళితే పోలీసుల లాఠీచార్జీ! ఇండ్ల కొస్తే ఈ బాడుకవ్‌లు కాల్చి చంపుతామని బెదిరింపు. థూ! నీయవ్వ జిందగీ! గింత బాడుకవ్ దేశం ప్రపంచంలో ఇంకేడగూడా వుండదు దూ... దూ..."

"ఏమిరోయ్ స్పీచ్‌లిస్తున్నావ్? మంచిగ లారీ ఎక్కుతున్రా లేదా?" ఇద్దరు కత్తులు తీసుకుని మా మీద కొచ్చారు. పక్షవాతం వచ్చినట్టున్న కాళ్ళను కూడదీసుకుంటూ అందరం మళ్ళీ లారీ ఎక్కాం. ఈసారి లారీ ఎక్కువదూరం వెళ్ళకుండానే హోమ్‌మినిష్టర్ జీప్‌తోపాటు వస్తున్న నాలుగు లారీలు పార్టీ గూండాలతో ఎదురువచ్చి ఆటకాయించినాయి.

"లారీల్లోనూ లోపటున్నోళ్ళనూ అందర్నీ జలాయించండ్రి" అంటూ అరిచాడు హోంమినిష్టర్. అప్పటికే మా లారీ పక్కన బాంబులు ప్రేలడం మొదలయింది.

ఆ తరువాతేం జరిగిందో నాకు తెలీదు.

తిరిగి కళ్ళు తేరిచేసరికి అందరం గవర్నమెంట్ హాస్పిటల్లోని వరండాల్లో వరుసగా నేలమీద పడివున్నాం. అందరికీ బాండేజీలు!

వార్డ్ లోపల్నుంచి టి.వి.వార్తలు వినబడుతున్నాయి.

“నేడు రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన బంద్ సంపూర్ణంగా విజయవంతం అయిందని రాష్ట్ర బంద్ శాఖామంత్రి శ్రీబందేశ్వర్రావుగారు తెలియజేశారు. రాష్ట్ర ప్రజలంతా అమితమయిన ఆనందోత్సాహాలతో బంద్‌లో పాల్గొని ఇళ్ళల్లోనుంచి బయటకు రాకుండా పూర్తి మద్దతు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి వారికి తమ అభినందనలు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో తెరచిన కొన్ని దుకాణాల మీద ముఖ్యమంత్రి బృందం అతి ధైర్యసాహసాలతో పోలీసుల సాయంతో దాడులు జరిపి తగలబెట్టారు. ముఖ్యమంత్రే స్వయంగా ఆరు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు జ్యోతిని వెలిగించి నిప్పంటించినప్పుడు ఆయన పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేశారు. ఒక కేంద్ర ప్రభుత్వ కార్యాలయానికి నిప్పంటిస్తున్నపుడు ప్రతిఘటించిన కొంతమంది కేంద్ర సిబ్బందిని స్వయంగా ముఖ్యమంత్రే తమ మిషన్‌గన్‌తో కాల్చి చంపారు. ఈ కాల్పుల్లో అయిదువేలమంది మరణించగా ఎనిమిదివేలమంది గాయపడ్డారు. రాష్ట్రం మొత్తం మీద పదహారు ప్రయాణికుల రైళ్ళను ప్రయాణికులతో సహా తగుల బెట్టినప్పుడు మంటలార్పడానికి ప్రయత్నించిన కేంద్ర రిజర్వ్ దళాలతో రాష్ట్ర పోలీస్ దళాలు రాత్రి పన్నెండు గంటల వరకూ పోరాటం జరిపాయి. రాష్ట్ర కాబినెట్ మంత్రులందరూ విధ్వంసకాండలో పాల్గొని ముఖ్యమంత్రికి తమ పూర్తి సహకారం అందజేశారు. అయితే రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన బంద్ పూర్తిగా విఫలమయిందని కేంద్రంలోని అధికారపార్టీ నాయకుడు శ్రీబంద్ జిత్‌యాదవ్ ప్రకటించారు. తాము బంద్‌కు ముందురోజే హైజాక్ చేసిన రెండువందల రాష్ట్ర ఆర్టీసిబస్‌లను బంద్ రోజు ప్రయాణికుల సౌకర్యంకోసం తమ పార్టీ డ్రైవర్ల సాయంతో నడపగలిగామనీ, రాత్రి పన్నెండింటివరకూ నడిపిన తర్వాతనే వాటిని తగలబెట్టామని, ఆయన తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన అనేక కార్యాలయాల భవనాలను ధ్వంసం చేసి తగులబెట్టినందుకు ఆయన కేంద్ర రిజర్వ్ పోలీస్‌ని అభినందించారు. తమ పార్టీ వాలంటీర్లు బంద్‌కి వ్యతిరేకులయిన అనేకమంది ప్రజలకు తమ తమ విధులకు హాజరయేందుకు ఎన్నో విధాలుగా సహాయం చేశారని ఆయన అన్నారు. తాము స్వయంగా నగరమంతా పర్యటించి షాపులు తెరవడానికి నిరాకరించిన అనేకమందిని చంపక తప్పలేదని ఆయన అన్నారు. రాష్ట్ర గవర్నర్ శ్రీబజోషి పక్షపాత వైఖరి అవలంభించి కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కయితామే ఒకషాపు తెరచి సరకులు అమ్మారనీ ఇది సహించరాని విషయమని రాష్ట్ర హోంశాఖామంత్రి తమాగ్రహాన్ని తెలియజేశారు. మొత్తం మీద బంద్ ప్రశాంతంగా జరిగిందని, చెదురుమదురు సంఘటనలు మినహా, అవాంఛనీయ సంఘటనలేమీ జరగలేదని, అందువల్ల రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌కి కాబినేట్‌మంత్రి హోదా కలుగజేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి శ్రీనిరక్షరాస్యరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని స్టూడెంట్స్ అందరూ బంద్‌లో

పాల్గొన్నారనీ, ఆ రోజు రాష్ట్రంలోని కాలేజీలు, హైస్కూళ్ళూ అన్నీ ఫర్నిచర్‌తో సహాతగలబడిపోయి కూలిపోయినందున వారందరికీ కర్నాటక విద్యాలయాల్లో శిక్షణ ఇప్పించేందుకు ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.”

ఇంక మేము వార్తలు వినలేదు.

మా పక్కనే కూర్చుని మా వంక ఆందోళనగా చూస్తోన్న మా కుంటుంబ సభ్యులతో మాట్లాడడం ప్రారంభించాము.